# మంగా.. మంగా..

శ్రీమతి ఆర్. ఎస్. హైమవతి

"అమ్మగోరూ! బట్టలిడదీశాను. లెక్క సూసుకోండి." అంది రజకుల పిల్ల మంగ. అది పిల్లంటే చిన్న పిల్లేమీ కాదు. ముప్ఫై దాటిన పెళ్లికాని అమ్మాయి!

"ఆఁ! వస్తున్నా!" అంటూ పద్దు పుస్తకం తీసుకెళ్లాను. బట్టలు పద్దు చూశాను. ఎప్పుడూ తేడా ఉండదు. ఒక్క బట్ట కూడా బాకీ పెట్టడం గాని, చింపడం గాని చెయ్యదు.

మళ్లీ బట్టలు వేశాను. లెక్క పెట్టి దేనికది విడదీసింది. అదలా విడదీస్తూంటే – దాని తలలో అక్కడక్కడా నెరిసిన వెంట్రుకలు కనబడ్డాయి.

హూఁ! దీనికి జుట్టు కూడా నెరిసి పోతోంది. దగ్గిర దగ్గిర ముప్ఫై ఐదు వచ్చాయి. మరి నెరవకేం చేస్తుంది? అయినా దీని పట్టు మాత్రం వదలడం లేదు.

చదువుకున్న వాళ్లు సంపన్న వర్గాలు అగ్రవర్ణాలు వాళ్ళే తమ ఆశల్ని చంపుకుని – సంఘానికి భయపడి – తప్పని సరిగా రాజీ మార్గం పడుతున్నారు. కాని, మంగ మాత్రం తను కోరుకున్న కోరిక తీరాలని పట్టుదలగా కృషి చేస్తోంది. కాని, అది తీరుతుందని నాకు తోచడం లేదు. పిచ్చి మంగ. ఆఖరికి దీనిగతి ఏమౌతుందో? ఇలా ఆలోచిస్తున్న నేను–

"ఏటమ్మగోరూ? ఆలోసిత్తన్నారు! బేగ పద్దేయండి. పోవాల." అన్న మంగ మాటలతో వాస్తవానికి వచ్చాను.

"నీగురించే ఆలోచిస్తున్నానే! ఇంకా ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావు? దగ్గిర దగ్గిర ముప్ఫై ఐదేళ్ళు వచ్చాయి. జుట్టు అక్కడక్కడా నెరుస్తోంది. మీ అమ్మ, నాన్న ముసలి వాళ్ళయ్యారు. వాళ్ళు కాస్త హరి మన్నారంటే నిన్నెవరు చూస్తారో?" అన్నాను.

"ఏటమ్మగోరూ? ఇప్పుడు మాత్తరం ఆళ్ళు సంపాయించి నాకు కూడెడతన్నా రేటండి? నేనేకదా సంపాయించి ఆళ్ళని పోసిస్తుండాను. అన్నగా దుండాడని పేరేగాని – ఆడికి ఇంటి గొడవే పట్టదాయె! ఆడుసంపాదించిన నాలుగు డబ్బులు ఆడికి తాగి తందనా లాడటాకే సాలవు. ఆడి పెళ్ళాం బిడ్డలే అడుక్కు తింటావుంటే ఇక ఆడేం అమ్మనీ అయ్యనీ సూత్తాడు? నాకు పెళ్ళి నేకపోతేనేం?అమ్మగోరూ! సదూ సట్టూ నేక సంపాయించిన నాలుగు డబ్బులూ తాగి తందనాలాడే దొంగ నాయాళ్ళని పెళ్ళి సేసుకునే కన్నా ఇలాగే కట్టపడి సంపాయించి అమ్మని, అయ్యని సాకుతా గడిపెయ్యడమే మంచి దమ్మగోరూ!" అంది మంగ స్థిరంగా.

అది తొందర పెయ్యడంతో బట్టలు పద్దు చూసి పంపించాను. కాని, అమె వెళ్ళినా ఆమె గురించిన ఆలోచనలు నన్ను చుట్టు ముడుతూనే ఉన్నాయి.

* * * * * *

ఇరవై ఏళ్ళ క్రితం నేను కొత్త కోడలిగా ఈ ఇంట్లో అడుగు పెట్టాను. అప్పుడు మంగకి పదమూడు, పధ్నాలుగు ఏళ్ళుంటాయి. అప్పుడే కొత్తగా యవ్వనంలో అడుగు పెడుతూన్న మంగ నల్లగా వున్నా ఎంతో అందంగా వుండేది. చక్రాల్లాంటి పెద్ద పెద్ద కళ్ళు, పొడుగాటి జడ. నవ్వితే సొట్టలు పడే బుగ్గలు. దక్కని పలువరుస. ఎంతో ముచ్చటగా వుండేది. అది కొత్త పెళ్లి కూతురి నైన నన్నే తదేకంగా చూస్తూ వుండేది.

కొత్త కోడలి గృహప్రవేశ సమయంలో – బట్టలుతకడం, పక్కలెయ్యడం, ఇంట్లో చిన్న చిన్న పనులు చెయ్యడం కోసం – ఓ నాలుగు రోజులు దాన్ని రాత్రింబగళ్ళు ఇంట్లో వుండమన్నారు అత్తగారు వాళ్ళు.

అది ఏప ని చేస్తున్నా దాని చూపులు మాత్రం నామీదే వుండేవి. నేను ఏదైనా అడిగితే చాలు. వెంటనే తెచ్చిచ్చేది.

తరువాత కూడా వాళ్ళమ్మ బట్టలు తెచ్చినప్పుడల్లా తనూ కూడా వచ్చి నాతో కాసేపు కబుర్లు చెప్తే గాని వెళ్ళేది కాదు.

క్రమేపీ దానికి పని ఎక్కువ అయిపోయింది. కారణం వాళ్ళమ్మ పక్షవాతం వచ్చి మంచాన పడింది. అయ్యకి వయసయిపోయి నందువల్ల – దగ్గు, ఆయాసం, నీరసంతో ఏ పనీ చెయ్యలేక ఇంట్లోనే వుంటాడు. అన్న మామకూతుర్ని చిన్నప్పుడే పెళ్ళి చేసుకుని వేరెళ్ళి పోయాడు. అతగాడు ఎనిమిది మందిని కన్నాడే గాని, వాళ్ళకి కూడు, గుడ్డ పెట్టాలన్న ఇంగితం లేకుండా సంపాదించిన నాలుగు డబ్బులూ తాగుడుకే తగలేస్తాడు. ఆ వదిన ఏదో నాలుగిళ్ళల్లో బట్టలుతికి ఆ పిల్లలకి కాసిని గంజి నీళ్ళు పోస్తుంది. ఒక్కొక్కప్పుడు ఆ డబ్బులు కూడా అతగాడు తన్ని లాక్కుంటూ వుంటాడు.

మంగకి అత్త కొడుకు వున్నాడు. మంగని వాడికిచ్చి చెయ్యమని వాళ్లత్త చిన్నప్పటి నించీ అడుగుతోంది. కాని, మంగకి అతగాడిని చేసుకోడం ఇష్టంలేదు. కారణం – అతగాడికి చదువులేదు. మంగ అన్న లాగే అతడూ కులవృత్తితో సంపాదించిన నాలుగు డబ్బులూ తాగుడుకి తగలేస్తాడు. షోకు లెక్కువ. సినిమాలు, సిగరెట్లు లాంటి దుబారా ఖర్చు లెక్కువ.

అవన్నీ మంగకి నచ్చవు. అది ఎనిమిదవ తరగతి వరకూ చదివింది. కనీసం ఎస్. ఎస్. ఎల్. సి అయినా చదివి చిన్న ఉద్యోగమైనా చేసే వాడు కావాలని దాని ఆశ. ప్యూను ఉద్యోగమైనా చేసి భార్యా పిల్లలని బాధ్యతగా చూసుకునే వాడు కావాలని దాని కోరిక.

దాని తల్లి, తండ్రి దాన్ని అత్త కొడుక్కి ఇచ్చి చేద్దామని చూశారు. తను ఉరేసుకుని చస్తాను గాని వాణ్ణి మాత్రం పెళ్ళి చేసుకోనని పట్టు పట్టింది మంగ. ఇక చేసేది లేక ఊరుకున్నారు వాళ్ళు.

ఒక సారి ఓ పెళ్ళికొడుకు మంగని చూడ్డానికి వచ్చాడు. అతడు బి. ఎ. పాసై తాలూకాఫీసులో గుమాస్తాగా చేస్తున్నాడట. అతనికి ఇది నచ్చింది. దీనికీ అతను నచ్చాడు. కాని, అతగాడి తల్లిదండ్రులు పదివేలు కట్నం అడిగారు. అంతకట్నం వీళ్ళెక్కడ ఇవ్వగలరు? రోజూ తిండి గడవడమే కష్టంగా వుందాయె!

ఆ మాట విన్న నేను– "ఏమిటే మంగా? మీ కులంలో కూడా కట్నాలు ఉన్నాయా?" అడిగాను ఆశ్చర్యంగా.

"అదేంటమ్మగోరూ? అట్టా ఆశ్చర్య పోతుండారు? కట్నం మాలోనే ఎక్కువ ఆ మాటకొస్తే! ఎందుకంటేనండీ మీలో సదూకున్నోళ్ళు శానామంది ఉంటారు. కనుక సదూకున్నోళ్ళకి మీలో అంత యిలువ లేదు. మాలో సదూకున్నోళ్ళు శానా తక్కువ కదమ్మా! అందుకే సదూకున్నోళ్ళకి కళ్ళు

టానా-ఆంధ్రసచిత్ర వార పత్రికల సంయుక్త సాహితీ సంబరంలో రు.500/- బహుమతి పొందిన కథ

నెత్తికెక్కుతాయి. ఆడు పూను ఉద్యోగం సేసినా సరే! కలెక్టరు ఉద్యోగం సేస్తున్నట్టు పోజు కొడతాడు" అంది.

"అయితే మీలో కూడా అంతంత కట్నాలిచ్చేవాళ్ళు ఉన్నారా మరి?"

"ఎందుకు లేరండి? కొందరు మంచి లాండ్రి లెట్టుకుని, బట్టల కొట్టు లెట్టుకొని సంపాయిత్తా ఉండారు. కొందరు సదూకుని ఉద్యోగాలు సేత్తా వుండారు. అలాంటోళ్ళంతా ఇలాంటోళ్ళకి ఎంత కట్నమడిగినా ఇత్తా వుంటే నాలాంటోళ్ళని ఎలా సేసుకుంటారు సెప్పండి" అంది మంగ.

అది చెప్పిందీ నిజమే! డబ్బున్న వాళ్ళు ప్రతీకులంలోనూ పోటీలుపడి కట్నాలు ఇస్తూ వుంటేనే అసలీకట్నాలిలా పెరిగి పోతున్నాయి.

"అయితే మరి నీకు డబ్బు లేదు. కట్నం ఇస్తేగాని చదువుకున్నవాడు రాడు. చదువుకుని ఉద్యోగం చేసేవాడినేగాని నువ్వు చేసుకోవు. మరి ఈ సమస్య తీరేదెలా? నీ పెళ్ళి అయ్యేదెలా?" అన్నాను

"మీరు యారి కూడా సెప్పనంటే సెప్తా నమ్మగోరూ!" అంది సిగ్గుపడుతూ-

"ఏంటి? ఎవరినైనా ప్రేమించావా?" అడిగాను.

"ఛీ! పాడు. ఆ ప్రేమ, దోమ నాకు తెల్వదండి."

"మరి ఏమిటీ అంత రహస్యం?"

"ఏం లేదండి! మొన్న సంకురేత్రి సత్తెం— ఆడేనండి గోపాలం. ఆడు తాలూకాఫీసులో పన్జేత్తన్నాడు కదండీ! ఆడు సానా మంచోడండి. ఆడు నన్ను తప్పకుండా సేసుకుంటా నన్నాడండి. కాని, ఆళ్ళ అయ్యే కట్నం కావాలంటూ వుండాడు. ఆడి మాట కాదన్లేకండా వుండాడండి ఈడు. ఆడికి ఒక్క సెడు అలవాటు కూడా నేదంటండి. తెలుసుకున్నోళ్ళు సెప్పారు. సేసుకుంటే ఆసుంటాడినే సేసుకోవాలండి. అందుకే ఈ మద్దె— మనింటి బట్టలు, రావుతమ్మగోరి బట్టలు, ఈరయ్యగారి బట్టలు కాకుండా ఏరే కాలేజి ఆస్టలోళ్ళ బట్టలు కూడా ఉతుకుతున్నానండి. మొత్తం నెలకి సోడా, సబ్బు పొడి, బొగ్గులు, నీలిమందు కరుసులు పోగా ఎనిమిది వందలు మిగులుతున్నాయండి. అందులో ఇంటికి, అమ్మకి, అయ్యకి మందులకి పోగా మిగిలింది నెలకి బాంకిలో ఏత్తన్నానండి. ఇప్పటికి ఐదు వేలు దాకా పోగయ్యిందండి! ఇంకో ఐదువేలు పోగయితేనండి ఉద్యోగం సేసే వోడు వత్తాడండి" అంది మంగ.

దాని దృష్టి ఆ గోపాలం మీదే వుందని గ్రహించాను.

దాని పట్టుదలకి, ఓర్పుకి, కృషికి ఆశ్చర్యపోయాను. ఈమధ్య చాలామంది వాషింగ్ మిషన్లు కొనేసుకుంటున్నారు. ఇళ్ళల్లో పని మనుషులచేతే ఉతికించుకుంటున్నారు. ఇస్త్రీకి కూడా కొందరు ఇస్తారు. కొందరు వాళ్ళే చేసుకుంటారు. అందువల్ల మంగలాంటి వాళ్ళకి పని దొరకటం లేదు.

ఈ మధ్య మంగ ఇంకా ఎక్కువ డబ్బు సంపాదించాలనే పట్టుదలతో ఒక చిన్న స్కూలు పని కూడా ఒప్పుకుంది.

మంగ తెల్లవారు ఝామునే నాలుగు గంటలకల్లా



వాళ్ల వాళ్లతో చెరువు గట్టుకి వెళ్ళి బట్టలుతుకుతుంది. అవన్నీ ఉతికి ఆరేశాక ఇంటికి వచ్చి కాస్త చద్దన్నమో, గంజో కడుపులో వేసుకుని హాస్టలు కెళ్తుంది. అక్కడ బట్టలు తీసుకుని ఇంటికి వచ్చి ఉడకేసి తీసుకెళ్ళి చెరువు గట్టున ఉతికి ఆరేస్తుంది. తొమ్మిది గంటలకల్లా సరిగ్గా స్కూలుకి వెళ్ళి స్కూలంతా ఊడిచి అన్ని డ్రమ్ముల్లోనూ నీళ్ళు తోడి పోసి వస్తుంది. అప్పుడు ఇంట్లో కాస్త అన్నం వండి అమ్మకి, అయ్యకి పెట్టి తాను తింటుంది.

ఆరిన బట్టలన్నీ తెచ్చి మెల్లిగా మడతలు పెట్టి ఇస్త్రీ చేసి ఎవరిళ్ళవి వాళ్ళకి, హాస్టలుకి సాయంకాలం లోపల వప్పచెప్తుంది. మధ్యలో బైటవాళ్ళెవరైనా అడిగితే బట్టలు ఇస్త్రీ చేసి ఇస్తూంటుంది.

ఇంట్లో ముసలి తల్లి దండ్రుల పని చూసుకుంటూ బైట ఇన్ని పన్లు చేసి సంపాదించి డబ్బు నిలవ చేసుకుంటున్న మంగని చూస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. దాని లక్ష్యసాధన కోసం అది చేసే కృషి చూస్తుంటే జోహారు లర్పించాలని పిస్తుంది. దాని ఓర్పుకి, సత్ప్రవర్తనని అభినందించాలనిపిస్తుంది.

ఓరోజు అడిగాను. "ఏం? మంగా ఇప్పటికి ఎంత పోగయింది? పదివేలు పోగయిందా?" అని.

"ఆఁ! పోగయిందమ్మగోరూ!"

"మరి పెళ్ళెప్పుడు?" అడిగాను.

"ఆ గోపాలం ఎక్కడున్నాడో? ఎలా ఉన్నాడో తెల్దమ్మగోరూ!"

"పోనీ మరో చదువుకున్నవాడిని చేసుకోవచ్చుగా!" అన్నాను.

"సేసుకోవచ్చనుకోండి. అయినా నా ఈడు మొగోళ్ళకి పెళ్ళిళ్ళు అయిపోయినాయంటండి! మరో ఒకరిద్దరు సదుకున్నోళ్ళు ఉండారు. ఆళ్ళకి ఇప్పుడు రేటు ఇంకా పెరిగినాదంటండి. పదివేలు

# మంగా! మంగా!



సాలదంట. ఇప్పుడు కూలి పని సేసుకునేటోడికే ఐదు వేలు. పదివేలు అడుగుతున్నారంట" అంది నీరసంగా.

హతవిధీ! దీని శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరేనా? అనుకున్నాను.

* * * * *

"అమ్మగోరూ! అమ్మగోరూ!" అంటూ ఉషారుగా కేకలు పెట్టింది ఒకరోజు మంగ ఉదయం వేళ.

వంట పనిలో మునిగి వున్న నేను "ఏమయిందే? అలా కేకలు పెడతావు. ఇప్పుడేగా వచ్చావు. బట్టలు తీస్తూ వుండు. అంతట్లోకే అంత తొందరేమిటి?" అంటూ వంటింట్లోంచే అరిచాను.

"లేదమ్మగోరూ! తొరగా రండి. మీకో మంచి సుభవార్త సెప్పాల."

"అబ్బో! ఏమిటేవ్ అది?" అంటూ వంటింట్లో స్టౌ సిమ్‌లో పెట్టి వచ్చాను.

మంగ సిగ్గుపడుతూ మెల్లిగా చెప్పడం ప్రారంభించింది.

"అడు ఒచ్చినాదండి."

"ఎవడే?"

"అడేనండీ! తాలూకాపీసులో గుమాస్తాగా సేస్తన్న గోపాలం అనేటోడు."

"ఆఁ! వచ్చి? ఏమన్నాడేమిటి? పదివేలు పోగయిందా? అన్నాడా? లేకపోతే మరో పదివేలు పోగుచెయ్యమన్నాడా?"

"ఛ! ఏటమ్మగోరూ? మీరు. అడు అలాంటోడు కాదండి. అడు నాకోసమే ఇన్నాళ్ళూ పెళ్ళి సేసుకోకండా ఆగిపోనాడంటండి. ఆళ్ళమ్మ అళ్ళు ఎందరో కట్నం ఇచ్చేటోళ్ళని తెచ్చి సూపినారంటండి. అయినా ససేమిరా! అన్నాడంటండి. సివరికి ఆళ్ళమ్మ కొడుకు పెళ్ళి సూడకుండానే సచ్చిపోనాదంటండి. ఆళ్ళయ్యేమో ఆడితో 'యార్నో ఒకర్ని నీకు నచ్చినదాన్నే సేసుకోరా! పో!' అన్నాడంటండి. ఆడు ఎంటనే ఈడకి లగెత్తుకొచ్చిండు. అమ్మతోనూ, అయ్యతోను నిన్న మాటాడాడండి. ఆళ్ళయ్యతో పాటు మా అమ్మని, అయ్యని కూడా సూత్తానన్నాడండి. రేపు శుక్రవారం శివాలయంకాడ మా పెళ్ళండి. మీరు తప్పకండా రావాలండి." అంది ఆనందంతో గుక్క తిప్పుకోకుండా మంగ.

నా మనసు తృప్తిగా నిట్టూర్చింది. దానికేదైనా మంచి ప్రెజంట్ ఇవ్వాలి. దాని పెళ్ళి కుదిరి పెళ్ళి చేసుకుంటున్నందుకు ఆనందంగా వున్నా- అలాంటి మనిషి నాకు తిరిగి దొరకదని అది వెళ్ళిపోతున్నందుకు ఓ పక్క బాధగా వుంది. చిరకాల నేస్తం దూరమౌతున్నందుకు మనసు మూలిగింది. నాకు తెలియకుండానే నా కనుకొలకుల్లో నీళ్ళు నిలిచాయి.

"అదేంటమ్మగోరూ! నాకు పెళ్ళవుతున్నాదంటే ఏడుత్తున్నారు? మీ కిట్టం నేదా?" అంది చిన్నమొహం పెట్టి.

"ఛ! అదేం లేదే! నీవు దూరంగా వెళ్ళిపోతావంటే ఎందుకో బాధగా వుంది. అంతే! అయినా నువ్వు స్థిరచిత్తంతో ఇన్నాళ్ళూ నీ లక్ష్య సాధనకి కృషి చేశావు. ఓపిగ్గా ఎదురు చూశావు. ఈనాటికి నీ ఆశ ఫలించింది. నీ కోరిక నెరవేరింది. ఇంతకన్నా నాకు సంతోషం ఏముంటుందే? తప్పకుండా నీ పెళ్ళికి వస్తాను.

నిజంగా నువ్వు అదృష్టవంతురాలివి మంగా! నీ కష్టం, ఓర్పు, మంచితనం అన్నీ కలిసి నీకు మంచి ఫలితాన్నిచ్చాయి. నీ ధ్యేయాన్ని నెరవేర్చుకో గలిగావు. నా ఆశీస్సులు నీ కెప్పుడూ వుంటాయి." అన్నాను మనస్ఫూర్తిగా అభినందిస్తూ-

మంగ కనుకొలుకుల్లో కూడా నీళ్ళు తిరిగాయి. దాని కళ్ళల్లో నీళ్ళు తిరగగా నేను ఏనాడూ చూడలేదు.. ధైర్యానికి మారు పేరే మంగ. అటువంటి మంగ కళ్ళల్లో కూడా నీళ్ళు తిరగడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అవి ముమ్మాటికీ ఆనందబాష్పాలే అని నిశ్చయించాను.

## శ్రీమతి ఆర్.ఎస్. హైమవతి



శ్రీమతి ఆర్.ఎస్. హైమవతి "మంగా! మంగా!" కథానిక రచయిత్రి. పూర్తి పేరు రెట్టిగంటి సీతాహైమవతి. నలభై సంవత్సరాల క్రితం పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం తాలూకా భీమలాపురం గ్రామంలో జన్మించారు. తల్లిదండ్రులు దీదువాను వెంకట నరసింహారావు, దీదువాను కామేశ్వరమ్మ గార్లు. పి.యు.సి. వరకూ నరసాపురంలో చదివి, వివాహానంతరం ప్రైవేటుగా చదివి బి.ఏ. డిగ్రీ పొందారు. రచయిత్రి తనను తాను పరిచయం చేసుకుంటూ-

"వివిధ పత్రికల వారు నిర్వహించిన వ్యాసరచన, మినీకథల, అనుబంధ నవలల పోటీలలో బహుమతులు లభించాయి. ఇప్పుడీ కథకు బహుమతినిచ్చి ప్రోత్సహిస్తున్న టానా-ఆంధ్రసచిత్ర వారపత్రిక వారికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

వివిధ పత్రికలలోను, రేడియోలోను వెలుగు చూసిన కథలు పాతిక దాటాయి. మూడు నాటికలు మద్రాసు కేంద్రం నించి ప్రసారమయ్యాయి. పది వ్యాసాలు, బాలసాహిత్యంలో కథలు, గేయాలు, మినీ కథలు అన్నీ కలిపి ఏభైకి పైనే వెలుగు చూశాయి." అంటున్నారు.